ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 29.0
కనిష్ఠం 22.2
**
ANDHRAJYOTHY

సూర్యాపేట
5
గురువారం 14 ఆగస్టు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	588.90 (308.7614)	2,69,445	2,28,141
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.90 (3.91)	13,254	13,254
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	170.8313 (39.5517)	3,45,381	3,63,339

చికెన్ ధరలు | లైవ్ : రూ.132 | డ్రెస్ : రూ.197 | స్కిన్‌లెస్ : రూ.221

ముసురుకుంది

జిల్లాలో బుధవారం రోజంతా వర్షం కురిసింది. సోమవారం రాత్రి మొదలైన వర్షం బుధవారం కూడా కొనసాగింది. ముఖ్యంగా జిల్లా కేంద్రంలో రోజంతా ముసురు ఉండగా సాయంత్రం వర్షం గంటకు పైగా కురిసింది. కోదాడ, తుంగతుర్తి, తిరుమలగిరి, హుజూర్‌నగర్, జాజిరెడ్డిగూడెం, పాలకవీడు, నేరేడుచర్లలతో పాటు పలు మండలాల్లో వాగులు, చెరువులు నిండుకుండలను తలపిస్తున్నాయి. జిల్లాలో 36.5 మిల్లీమీటర్ల సరాసరి వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పాలకవీడులో 11.47 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా తిరుమలగిరిలో 2.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆత్మకూరు(ఎస్) మండలం తుమ్మలపెన్‌పహాడ్ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో ఎంఈవో పాఠశాలకు తాళం వేసి విద్యార్థులకు సెలవులు ప్రకటించారు.

- రోజుంతా కురిసిన వాన : అత్యధికంగా పాలకవీడులో 11.47 సెంటీమీటర్ల వర్షపాతం
- జిల్లా వ్యాప్తంగా నిండిన వాగులు, చెరువులు, కుంటలు
- పలుచోట్ల రహదారులపై ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

జనజీవనం అస్తవ్యస్తం

8

జిల్లాలో పలుచోట్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నేరేడుచర్ల మండలంలో జాన్‌పహాడ్-నర్సయ్యగూడెం, మఠంపల్లి మండలంలో చౌటపల్లి నుండి మేళ్లచెరువు వెళ్లే రహదారిలో కప్పలవాగు ఉధృత్తంగా ప్రవహిస్తుడడంతో రెండు మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మునగాల మండలంలో జాతీయ రహదారి వెంట పంట పొలాలు దెబ్బతిన్నాయి. చింతలపాలెం మండలంలోని చింతిర్యాల బ్రాంచ్ కాల్వకు గండిపడింది. కోదాడలోని లోతట్లు ప్రాంత వాసులను ఇతర ప్రాంతాలకు తరలించారు.



చింతలపాలెం మండలం దొండపాడులో వరద ప్రభావిత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



హుజూర్‌నగర్ మండలం లక్కవరం గ్రామంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును దాటిస్తున్న జాలర్లు



మోతె మండలం కూడలి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పాలేరు వాగు

• కలెక్టర్ విస్తృత తనిఖీలు

వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అప్రమత్తమయ్యారు. యంత్రాంగానికి సూచనలు చేస్తూనే జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. దెబ్బతిన్న రహదారులను, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను, చెరువులను ఆయన పరిశీలించారు. మఠంపల్లి, చింతలపాలెం, మేళ్లచెర్వు, నేరేడుచర్లతో పాటు పాలకవీడు, సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయన పర్యటించారు.

మట్టపల్లి ఆలయంలోకి వరద నీరు



6

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

సూర్యాపేట క్రైం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి):జిల్లావ్యాప్తంగా మరో మూడురోజుల పాటు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే చెరువులు, కుంటలు, వాగులు నిండాయన్నారు. అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దన్నారు. కూలీ వర్షాలు తగ్గే వరకు పనులు ఆపుకోవాలన్నారు. ఏదైనా అవసరం ఉంటే కంట్రోల్ రూం 8712686026కు సంప్రదించాలన్నారు.



ఆత్మకూరు(ఎస్) మండలంలో శిథిలావస్థకు చేరిన తుమ్మలపెన్‌పహాడ్ పాఠశాలకు తాళం వేస్తున్న సిబ్బంది

నేడు పాఠశాలలకు సెలవు

సూర్యాపేట(కలెక్టరేట్) : భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో జిల్లావ్యాప్తంగా పాఠశాలలకు గురువారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అన్ని పాఠశాలల యాజమాన్యాలు గురువారం సెలవు పాటించాలని ఆదేశించారు. ఒకవేళ పాఠశాలలను కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటనలో హెచ్చరించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రెండో విడత లైసెన్స్ సర్వేయర్ల శిక్షణను ఈ నెల 18 నుంచి అక్టోబరు 22వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడారు. భూభారతి చట్టం అమలుకు ఎంపిక చేసిన లైసెన్స్ సర్వేయర్ల మొదటి విడతలో 238 మంది అభ్యర్థులకు శిక్షణ పూర్తి చేశామన్నారు. రెండో విడతలో 50 రోజులు శిక్షణ ఉంటుందన్నారు. ఇందులో 266మంది లైసెన్స్ సర్వేయర్లు శిక్షణ పొందనున్నట్లు ఆయన తెలిపారు. భూభారతి దరఖాస్తుల పరిష్కారం కోసం రెవెన్యూ యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా పకడ్బందీగా సమస్యలను పరిష్కరానికి యంత్రాంగం ప్రయత్నిస్తోందన్నారు.

ఎస్సారెస్పీ కాల్వలకు మరమ్మతులేవీ?

- మారని కాల్వల రూపురేఖలు
- 10 కిలోమీటర్ల మేర లైనింగ్ పనులు



రామన్నగూడెం సమీపంలో పిచ్చిమొక్కలు, చెట్ల పొదలతో నిండి ఉన్న ఉపకాల్వ

అర్వపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంసాగర్ రెండో దశ ఆయకట్టుకు 20 ఏళ్ల కిందట రూ.1,100 కోట్లతో 69, 70, 71 డీబీఎం మెయిన్ కాల్వలు, ఉప కాల్వలు తవ్వారు. 20 ఏళ్లుగా చివరి భూములకు నీరందడం లేదు. ఎస్సారెస్పీ కాల్వలను 2.44 లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందించే లక్ష్యంతో రూపకల్పన చేశారు. శ్రీరాంసాగర్ కాల్వలు అస్తవ్యస్తంగా చెట్లపొదలతో మట్టి పూడిపోయి అధ్వానంగా మారాయి. 40శాతం నీరు వృథాగా పోతోంది. వర్షాలు వచ్చినప్పుడల్లా కాల్వలు కోతకు గురై కాల్వలు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. జిల్లాలోని చివ్వెంల, నూతనకల్, మోతె, పెన్‌పహాడ్, ఆత్మకూరు(ఎస్), నడిగూడెం, గరిడేపల్లి మండలాల్లోని చివరి భూములకు నేటి వరకు నీరు అందినా దాఖలాలు లేవు. రైతులు ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా, ఆందోళనలు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని రైతులు వాపోతున్నారు. జాజిరెడ్డిగూడెం మండలంలో రామన్నగూడెం గ్రామసమీపంలోని ఉపకాల్వకు తూతూ మంత్రంగా ఉపాధి హామీ పథకం కింద రూ.6లక్షలతో చెట్లను తొలగించారు. కాల్వ పటిష్టతను పట్టించుకోవడంలేదు. అర్వపల్లి, కుంచమర్తి, తిమ్మాపురం గ్రామాలసమీపంలో ఉపకాల్వలు పిచ్చి మొక్కలు మొలిచి దర్శనమిస్తున్నాయి. పెద్దచెట్లు, పిచ్చిమొక్కలను తొలగించి మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరారు.

తూతూ మంత్రంగా మరమ్మతులు

ఎస్సారెస్పీ రెండో దశ కింద విజయ్‌నగర్ కాలనీ నుంచి అడివెంల గ్రామంలోని గోపాల్‌నగర్ వరకు 2018లో 12 కిలోమీటర్లు కాంక్రీట్ చేశారు. శ్రీరాంసాగర్ మెయిన్ కాల్వలు 150 కిలోమీటర్ల విస్తరించి ఉన్నాయి. 12 ఏళ్ల క్రితం ఆధునికీకరణ కోసం రూ.300కోట్లు నీటి రాతలుగానే మిగిలాయి. తూతూ మంత్రంగా [illegible] తులు చేసినా నేటికీ పూర్తికాలేదు. మెయిన్ కాల్వలు, ఉపకాల్వలు మట్టితో కూరుకపోవడంతో నీరు విడుదల చేసినప్పుడల్లా 40శాతం వృథా అవుతోంది.

70 కిలోమీటర్ల పొడవు ఉన్న 71 డీబీఎం మెయిన్ కాల్వ

జిల్లాలో 71 డీబీఎం మెయిన్ కాల్వ 70 కిలోమీటర్ల మేర ఉంది. ఈ మెయిన్ కాల్వ కింద 1.44 లక్షల ఎకరాల భూమిని సాగులో తెచ్చేలా కాల్వలు తవ్వారు. ఈ కాల్వ కింద జాజిరెడ్డిగూడెం మండలంలో 10-ఎల్, 12-ఎల్, 18-ఎల్, 19-ఎల్, 11-ఆర్, 13-ఆర్, 14-ఎల్, 15-ఎల్, 16-ఆర్, 1-ఆర్, నాగారం మండలంలోని 4-ఆర్, 6-ఎల్ ఉపకాల్వలు ఉన్నాయి. ఈ ఉపకాల్వలు చెరువులు, కుంటలు నింపడానికే పరిమితమయ్యాయి. ఉపకాల్వల్లో మట్టి కూరుకుపోయి చెట్ల పొదలతో నిండి ఉండి

మిగతా 8వ పేజీలో

అందుబాటులో ఉండాలి

- డీఎంహెచ్‌వో చంద్రశేఖర్



మద్దిరాలలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

నూతనకల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. బుధవారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంతో పాటు, గ్రామాలలో సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఆయన వెంట మండల వైద్యాధికారి సందీప్, సిబ్బంది ఉన్నారు.

● మద్దిరాల : సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మద్దిరాల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట వైద్యాధికారి అమూల్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ నర్సింహ

సూర్యాపేటఅర్బన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎస్పీ నర్సింహ అన్నారు. నషాముక్త్ భారత్ అభియాన్, మాదక ద్రవ్యాల రహిత భారతదేశ నిర్మాణం కార్యక్రమంలో భాగంగా జిల్లాకేంద్రంలోని జయ పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. మాదక ద్రవ్యాల రహిత సమాజం నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. యువత జీవితంలో ఉన్నతంగా ఎదిగేలా లక్ష్యాలు ఏర్పాటు చేసుకొని వాటిని సాధించాలన్నారు. ఉపాధ్యాయుల సూచనలు పాటించాలన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం డ్రగ్స్ నిర్మూలనలో భాగస్వాములవుతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఐలు ఏడుకొండలు, శివతేజ, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ హరిబాబు, జయ పాఠశాల ప్రిన్సిపాల్ ఉపేందర్ ఉన్నారు.

యాదవ రేజ్‌మెంట్‌ను పునరుద్ధరించాలి



యాత్రలో పాల్గొన్న బడుగుల లింగయ్యయాదవ్, తండు శ్రీనివాస్‌యాదవ్

భానుపురి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): యాదవ రేజ్‌మెంట్‌ను పునరుద్ధరించాలని మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, తండు శ్రీనివాస్‌యాదవ్ కోరారు. సూర్యాపేటలో రేజంగ్లా రజ్ కలశ యాత్రగా వచ్చిన మాజీ సైనికుడు జక్కుల శ్రీనివాస్‌యాదవ్ బృందానికి బుధవారం అఖిల భారత యాదవ మహాసభ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశ రక్షణ రంగంలో అహిర్(యాదవుల) రేజిమెంట్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యాదవ రాష్ట్ర నాయకులు తండు శ్రీనివాస్‌యాదవ్, శ్రీకృష్ణ ట్రస్టు సేవా సమితి చైర్మన్ డాక్టర్ వూర రాంమూర్తియాదవ్, అఖిలభారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు మర్యాద సైదులుయాదవ్, పోలేబోయిన నర్సయ్యయాదవ్, తూము వెంకన్నయాదవ్, సుంకరబోయిన శ్రీనివాస్‌యాదవ్, శీలం సైదులుయాదవ్, వజ్జా వీరయ్యయాదవ్, కోడి సైదులుయాదవ్, వెంకన్నయాదవ్, మధుయాదవ్ ఉన్నారు.

ఎక్స్‌రే, స్కానింగ్ తీసేవారేరీ

- జిల్లా కేంద్ర ఆసుపత్రిలో వేధిస్తున్న సిబ్బంది కొరత
- ముగ్గురిలో ఇద్దరు సెలవుల్లో, ఒకరు ఉద్యోగానికి రాజీనామా?

(ఆంధ్రజ్యోతి-భానుపురి)



సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్యుల కొరత రోగులకు శాపంగా మారింది. అత్యవసర కేసులకు సంబంధించిన పరీక్షలు చేయాల్సిన వైద్యులు లేకపోవడంతో ప్రైవేట్‌ను ఆశ్రయించి, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా రేడియాలజిస్టు లేకపోవడంతో ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కానింగ్ సేవలు కొద్దిరోజులుగా నిలిచాయి. ప్రతి రోజూ రోగులు స్కానింగ్ కోసం తిరిగిపోతున్నారు. ప్రధానంగా గర్భిణులు, కిడ్నీ బాధితులు, గాల్‌బ్లాడర్, అపెండిసైటిస్, ఇతర సమస్యల పరిష్కారానికి పొట్ట భాగంలో పరిశీలించాల్సి ఉంటుంది. అయితే ముఖ్యంగా అల్ట్రాసౌండ్ స్కానింగ్ చూసే రేడియాలిజిస్టు అందుబాటులో లేడు. రేడియాలిజిస్టు చేస్తున్న ముగ్గురిలో ఒక రోడ్డు ప్రమాదంలో గాయపడగా, మరో వైద్యురాలు సెలవు పెట్టారు. మరో వైద్యుడు ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు తెలిసింది. ముగ్గురు లేకపోవడంతో కొద్దిరోజుల నుంచి అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లు నిలిచాయి. ప్రతి నిత్యం రోజుకు 50 నుంచి 60 మంది వరకు అల్ట్రాసౌండ్ స్కానింగ్‌కు రోగులు వచ్చే వారని సిబ్బంది చెబుతున్నారు. అయితే వారంతా తప్పని పరిస్థితిలో ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లకు వెళ్లక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి.

విధులపై అనాసక్తి?

ప్రభుత్వ ఆరోగ్య, వైద్య కేంద్రాలపై కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఇటీవల ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ క్రమంలో వైద్యులు, సిబ్బంది సకాలంలో విధుల్లో ఉండాలని సూచిస్తూ హెచ్చరిస్తున్నారు. ఇది కొందరికి మింగుడుపడటం లేదు. ప్రభుత్వ వేతనం కన్నా ప్రైవేట్‌లోనే మూడింతలు సంపాదించవచ్చనే ధోరణిలో పలువురు వైద్యులు ఉన్నట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం విధులకు రావడానికి కుదరదని తేల్చి చెబుతున్నట్లు తెలుస్తోంది. సూర్యాపేటలో 10 రోజులకోసారి ఏదో ఒక చోట లింగనిర్ధారణ పరీక్షలు, ఎక్కడో ఒకచోట వైద్యం వికటించి రోగులు మృతి చెందుతుండడం, ప్రైవేట్ వైద్యంపై నమ్మకం సన్నగిల్లుతోంది. అయితే ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం కలిగించడానికి కలెక్టర్ పలు దఫాలుగా పర్యవేక్షణ చేస్తూ సూచనలు చేస్తున్నారు. దీంతో కొంత మంది వైద్యులు తమకు ఉన్న ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం అందించడం ఇబ్బంది అవుతోందని భావించి విధులకు సక్రమంగా రావడంలేదు. సమయపాలన పాటించకపోతే బాగుండదని ఇటీవల వచ్చిన సూపరింటెండెంట్ చెబుతుండటాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నట్లు సమాచారం. అదేవిధంగా సూర్యాపేట జనరల్ ఆసుపత్రిలో గుండెకు

మిగతా 8వ పేజీలో

విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

నేరేడుచర్ల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అతి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్ హెచ్‌ఆర్డీ ఐటీ వి. శివాజీ ఆదేశించారు. నేరేడుచర్లలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆదేశాల మేరకు వివిధ హోదాల్లో పని చేస్తున్న 22వేల మంది ఉద్యోగులు విధుల్లో ఉన్నారన్నారు. మెడికల్ ఎమర్జెన్సీ మినహా అన్ని సెలవులు రద్దు చేశామన్నారు. వరదల వల్ల అవాంతరాలు ఏర్పడకుండా అధికారులు, సిబ్బంది 24గంటలు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఫ్యూజాఫ్ కాల్, ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు, విద్యుత్ లైన్ల మరమ్మతులు తదితర అవసరాల నిమిత్తం దక్షిణ విద్యుత్ సంస్థ 1912 టోల్ ఫ్రీ నెంబరు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఓపెనింగ్ మానిటరింగ్ సిస్టం ద్వారా ఎక్కడైనా విద్యుత్ సమస్య తలెత్తితే వెంటనే తెలిసిపోతుందన్నారు. సొంతంగా రైతులు, ప్రజలు విద్యుత్ మరమ్మతులకు ప్రయత్నించవద్దని సూచించారు.



మాట్లాడుతున్న విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్ హెచ్‌ఆర్డీ ఐటీ శివాజీ

విద్యుత్ ఉద్యోగుల సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో హుజూర్‌నగర్ డీఈ వెంకటేశ్వర్లు, టెక్నికల్ డీఈ కృష్ణారావు, ఏడీ నాగిరెడ్డి, ఏఈలు రవివర్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి



జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న జయ పాఠశాల విద్యార్థులు

సూర్యాపేటటౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని వాసవీ యూత్‌క్లబ్ అధ్యక్షుడు వెంపటి రవితేజ అన్నారు. జిల్లాకేంద్రంలోని కొత్తబస్టాండ్ నుంచి 104 అడుగుల తిరంగ జెండా ర్యాలీని బుధవారం ప్రారంభించి మాట్లాడారు. త్రివర్ణ పతాకం ఇళ్లపై ఎగురవేయడం ద్వారా ప్రతి ఒక్కరిలో జాతీయభావం పెంపొందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. దేశ భవిష్యత్ యువకుల చేతుల్లో ఉందని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం కల్నల్ సంతోష్‌బాబు విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసవియూత్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

యూరియా అందుబాటులో ఉంది



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ శ్రీధర్‌రెడ్డి

పెన్‌పహాడ్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సరిపడ యూరియా అందుబాటులో ఉందని రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా వ్యవసాయ అధికారి జి. శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చీదెళ్ళ గ్రామంలో ఎరువుల దుకాణం సొసైటీ గోదాములను తనిఖీ చేశారు. మండలంలో 225 మెట్రిక్ టన్నుల యూరియా సహకార సంఘంలో ప్రైవేట్ వ్యాపారుల వద్ద అందుబాటులో ఉందని తెలిపారు. యూరియాను దశల అవసరం మేరకు కొనుగోలు చేయాలని సీజన్ మొత్తానికి సరిపడ ఎరువులు ఒకేసారి కొనుగోలు చేయవద్దని సూచించారు. అనంతరం నానో యూరియా, నానో డీఏపీపై రైతులకు అవగాహన కల్పించారు. అధిక యూరియా వాడితే భూమి సారవంతాన్ని కోల్పోతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అనిల్ నాయక్, ఏఈవో రాజేష్, వెంకన్న, సైదులు, శ్రీను పాల్గొన్నారు.

శునక బెడద.. అప్రమత్తత ఎలా?

● వీధి కుక్కలపై సుమోటోగా స్పందించిన సుప్రీంకోర్టు ● దేశవ్యాప్తంగా చర్చ ● పెంపుడు కుక్కలతో అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు


మిర్యాలగూడ పట్టణంలోని ఓ వీధిలో తిరుగుతున్న కుక్కలు

దేశ రాజధానిలో పెరిగిన వీధి కుక్కల బెడదపై సుమోటోగా స్పందించిన దేశ అత్యున్నత న్యాయస్థానం కుక్కలు కనిపించకుండా చేయాలని అధికారులను ఆదేశించింది. వాటన్నింటినీ తక్షణమే షెల్టర్లకు తరలించాలని పేర్కొంది. తరలింపు ప్రక్రియకు అడ్డుపడే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలనీ సూచించింది. కుక్క కాటుతో వ్యాపించే రేబీస్ వ్యాధితో ఆత్మీయులను కోల్పోయిన వారికి తెచ్చి కుటుంబ సభ్యులకు జంతు ప్రేమికులు అందించగలరా..? అని కూడా ప్రశ్నించింది. ముంబైలో 90వేలకు పైగా కుక్కలు, బెంగళూరులో 70వేలకు పైగా ఉండగా, రాష్ట్రంలో 4లక్షల కుక్కలు ఉన్నట్లు సమాచారం. (ప్రభుత్వం హైకోర్టుకు తెలిపిన వివరాల ప్రకారం కుక్కల సంఖ్య 3,79,156). 2024లో దేశవ్యాప్తంగా 37లక్షల కుక్కకాటు కేసులు నమోదయ్యాయి. రేబీస్ కారణంగా ప్రతిఏటా 22వేల మంది చనిపోతున్నారు.

● (ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడ టౌన్)

రేబిస్ ఒక్కటే కాదు సుమా..

కుక్కకాటుకు చెప్పు దెబ్బ అనే సామెత నానుడిలో ఉన్నా.. కుక్క కరిస్తే బొడ్డు సుట్టూ సూదు వేయించుకునే వారు. కానీ మానవ మందుల తరహాలోనే కుక్కల మెడిసిన్ తయారీలోనే మార్పులు వస్తున్నాయి. అయితే కుక్క కరవడం కారణంగా రేబీస్ వ్యాధి మాత్రమే సోకుతుందనుకోవడం సరికాదంటున్నారు వెటర్నరీ వైద్యులు. కేనైన్ డిస్టెంపర్, పార్వో, ఇతర బ్యాక్టీరియల్స్ వైరల్స్ సోకే ప్రమాదముందంటున్నారు.

ఏబీసీ కార్యక్రమాలతో..

కుక్కల సంఖ్య నియంత్రించేందుకు ప్రభుత్వం యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) కార్యక్రమాలు అమలు చేస్తోంది. ప్రివెన్షన్ ఆఫ్ క్రూయాల్టీ టు యానిమల్స్ యాక్ట్(1960)ను అనుసరించి కుక్కలకు శస్త్రచికిత్స (న్యూటరైజేషన్) చేసి వ్యాక్సినేషన్ చేస్తారు. కుక్కల సంఖ్యను సరళీకృతంగా నియంత్రించేందుకు చేపట్టిన ఈ విధానం దేశవ్యాప్తంగా అమలువుతోంది.

స్థానిక సంస్థలకు బాధ్యతలు

కుక్కల నియంత్రణ చర్యలు కొనసాగిస్తూనే ఉంది భారత ప్రభుత్వం. యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా గుర్తింపు పొందిన సంస్థలతో పాటు శునక నియంత్రణ బాధ్యతలను స్థానిక సంస్థలకు అప్పగించింది. కార్పొరేషన్లతో పాటు మునిసిపల్ కేంద్రాలు, గ్రామపంచాయతీలు కుక్కల నియంత్రణకు జనరల్ ఫండ్ వినియోగంతో చర్యలు చేపడుతున్నారు. కుక్కల సంరక్షణ, నియంత్రణలో స్వచ్ఛంద సంస్థల పాత్ర చెప్పుకోదగినదే.

అప్రమత్తంగా ఉండాల్సిందే..

ఇటీవల కాలంలో పెట్ ప్రేమికులు పెరుగుతున్నారు. అయితే ఆయా జంతువుల పట్ల జాగ్రత్తగా ఉండాల్సిన అవసరముందంటున్నారు పశు వైద్యులు. శ్వాసకోస వ్యాధితో ఇబ్బంది పడేవారు కుక్కలకు వీలైనంత దూరంగా ఉండాలంటున్నారు. చిన్నపిల్లలను కుక్కలకు దూరంగా ఉంచాలని, పెంపుడు కుక్కే కదా అని పిల్లలు పెట్టిన తరుణంలో తల్లి కుక్క వద్దకు నేరుగా వెళ్లొద్దని హెచ్చరిస్తున్నారు. క్రమం తప్పకుండా కుక్కలకు వ్యాక్సిన్లు, నట్టల మందులు వేయించడంతో పాటు బయట కుక్కలను కలవనీయొద్దంటున్నారు. కాలక్షేపానికి కుక్కలను పెంచుకోవద్దని సూచిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో శునకాలు ఎక్కువే

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో శునక బెడద అధికంగానే ఉంది. యాదాద్రి జిల్లాలో 19 నెలల్లో 16,612 మందికి కుక్క కాటు బారిన పడినట్లు లెక్కలు చూపుతుండగా, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో నమోదైన కేసుల వివరాలు అస్పష్టంగా ఉన్నాయి. మిర్యాలగూడ వెటర్నరీ హాస్పటల్ పరిధిలో 999 కుక్కలున్నట్లు వైద్యులు తెలిపారు. నమోదవుతున్న కుక్క కాటు కేసుల్లో అత్యధికులు చిన్నపిల్లలే కావడం ఆందోళన కలిగించే విషయమే. సందులు, గొందుల్లో పదుల సంఖ్యలో సంచరిస్తున్న వీధి కుక్కలు ఒంటరిగా వెళ్లే వారిపై దాడులు చేస్తున్నాయి. రహదారిలో వెళ్తున్న ద్విచక్ర వాహన దారులను కరుస్తూ, కార్లపై ఎగబడుతూ భయాందోళనలు కలిగిస్తున్నాయి.




అప్రమత్తంగా ఉండాల్సిందే



కుక్కల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాల్సిందే. వీధి కుక్కలు గుంపులుగా ఉంటే అటుగా వెళ్లొద్దు. పొరపాటున కుక్క కాటుకు గురైతే డెటాల్ లేదా సబ్బుతో శుభ్రం చేసుకుని, వెంటనే వైద్యుడిని కలిసి చికిత్స తీసుకోవాలి. పెట్ డాగ్స్‌ను పెంచుకునే వారు మరింత అప్రమత్తంగా ఉండాలి. వాటిని ఆరోగ్యంగా ఉంచుకో వాలి. యాంటి రేబిస్ వ్యాక్సిన్ వేయించి చేతులు దులుపుకోకుండా వాటి పెంపకం పట్ల అవగాహన పెంచుకోవాలి. కుక్క కాటుతో రేబిస్ మాత్రమే కాకుండా ఇతర వ్యాధులు ప్రబలే ఆస్కారముంది.

● శంకర్‌రావు, వెటర్నరీ డాక్టర్, మిర్యాలగూడ.

కుక్కల నియంత్రణకు చర్యలు



పట్టణంలో కుక్కల బెడద అధికంగానే ఉంది. అన్ని వార్డుల నుంచి ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో డాగ్ క్యాచర్స్‌ను పిలిపించి వ్యాక్సినేషన్ చేయిస్తున్నాం. ప్రతీ మూడు మాసాలకోసారి ఈ ప్రక్రియ సాగుతుంది. ప్రజలు వీధి కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఏదైనా కాలనీలో వీధి కుక్కలు ఎక్కువగా ఉంటే కార్యాలయంలో ఫిర్యాదు చేయాలి. పెంపుడు కుక్కలు పెంచుకునే యజమానులు జంతు చట్టాలను అనుసరించాలి.

● గణవేణి శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



కేతేపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల హామీల అమలులో రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ జాగృతి నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని బీమారం గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. అంతకుముందు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకటరెడ్డి, బీమారం మాజీ సర్పంచ్ బడుగుల శ్రీనివాసయాదవ్, పార్టీ నాయకులు బీ.సురేష్, బీ.నాగేశ్వరరావు ఆమెకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దివ్యాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచకపోవడం నమ్మించి మోసం చేయడమేనన్నారు. సాగు అవసరాలకు సరిపడా యూరియా అందుబాటులో లేకుండా పోయిందన్నారు.

ఎంజీయూ స్నాతకోత్సవానికి గవర్నర్‌కు ఆహ్వానం


గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీసీ అల్తాఫ్‌హుస్సేన్

నల్లగొండ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ యూనివర్సిటీలో సెప్టెంబరులో నిర్వహించే స్నాతకోత్సవానికి హాజరు కావాలని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కోరినట్లు ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్‌హుస్సేన్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసి యూనివర్సిటీ అభివృద్ధికి సంబంధించిన నివేదికను వీసీ అందజేశారు. గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం విశ్వవిద్యాలయంలోని పరిణామాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. వీసీ వెంట రిజిస్ట్రార్ అల్వాల రవి, సీఈవో జీ ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌ను సందర్శించిన హౌసింగ్ సీఈ


బుద్ధవనంలో కుటుంబసభ్యులతో హౌసింగ్ సీఈ చైతన్యకుమార్

నాగార్జునసాగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హౌసింగ్ శాఖ సీఈ చైతన్య కుమార్ కుటుంబ సమేతంగా ప్రపంచ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్‌ను బుధవారం సందర్శించారు. నల్లగొండ జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన ఆయన సాగర్‌కు చేరుకున్నారు. సాగర్‌లోని ప్రధానం డ్యాం, డ్యాలరీ, జలవిద్యుత్ కేంద్రం, నాగార్జునకొండ, బుద్ధవనాన్ని సందర్శించారు. బుద్ధవనం విశేషాలను పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ వారికి వివరించారు. కార్యక్రమంలో బుద్ధవనం ఈవో శాసన, మేనేజర్ రవిచంద్ర, జిల్లా హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, డీఈ నాగేందర్, ఏఈ మేఘన, ప్రోటోకాల్ ఆఫీసర్ దండ శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు

నల్లగొండ స్పోర్ట్స్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి వాలీబాల్ అండర్-15 బాలబాలికల పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక కోసం గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలో పోటీలు నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో ఈ నెల 18, 19 తేదీల్లో ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 2010 జనవరి 1 నుంచి 2013 మధ్యలో జన్మించిన బాలబాలికలు అర్హులని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దగ్గుబాటి విమల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించే జిల్లా స్థాయి వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక పోటీల్లో పాల్గొనేలా పీఈటీలు చొరవ తీసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9948987026 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మట్టపల్లి ఆలయం ఆవరణలోకి నీరు


మట్టపల్లి ఆలయ ఆవరణలో చేరుతున్న లీకేజీ నీరు

మఠంపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం ఆవరణలోకి అడుగు మేర నీరు చేరింది. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు భారీ వరద వస్తుండటంతో క్రస్ట్‌గేట్లను ఎత్తి లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆ నీరంతా పులిచింతల ప్రాజెక్టుకు వస్తోంది. దీంతో ప్రాజెక్టులో నీటినిల్వలు గరిష్ఠస్థాయికి చేరాయి. ఈ క్రమంలో ఆలయం ఆవరణలోకి కరకట్ట నుంచి లీకవుతూ నీరు వచ్చి చేరుతోంది.

36 టీఎంసీలు నీటి నిల్వ ఉంటే...

పులిచింతల ప్రాజెక్టుకు వరద క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్టులో 32 టీఎంసీ నీటి నిల్వ ఉంటే పుష్కర ఘాట్లు, ఆలయ మెట్లు మునుగుతాయి. 36 టీఎంసీలు నీటినిల్వ చేస్తే ఆలయం చుట్టూ నిర్మించిన కరకట్ట ద్వారా లీకవుతూ వరద నీరు ఆవరణలోకి చేరుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో సుమారు 39 టీఎంసీ నీటి నిల్వ ఉంది. దీంతో దేవాలయం వద్ద కరకట్టకు సుమారు ఏడు అడుగుల మేర నీరు చేరింది. దీంతో ఆలయ ప్రాంగణంలోకి అడుగు మేర వరద నీరు చేరింది. ఈ నీటిని ఆలయ నిర్వాహకులు రెండు మోటర్ల ద్వారా బయటకు పంపిస్తున్నారు.

నాలుగేళ్ల కిందట

మట్టపల్లి ఆలయానికి మరోసారి వరద ముప్పు తప్పదా అని స్థానికులు చర్చించుకుంటున్నారు. 2020లో వరదలకు గర్భగుడి గుహ సగం వరకు నీరు చేరింది. ఆగస్టు 12 నుంచి 26వరకు మట్టపల్లి ఆలయం వరదకు గురికాగా నాలుగు రోజుల పాటు స్వామివారు నీటిలో మునిగిపోగా పూజరులు, అర్చకులు మెడ వరకు చేరిన నీటినిల్వలో నడుస్తూ గర్భగుడిలోకి వెళ్లి అర్చిత సేవలు పూర్తి చేశారు. మరోసారి ఆ ప్రమాదం పొంచి ఉందన్న భయాందోళన స్థానికుల్లో నెలకొంది.

పోస్టుమాస్టర్‌పై కేసు నమోదు

అడ్డగూడూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : డిపాజిటర్లను మోసం చేసిన పోస్ట్‌మాస్టర్‌ను రిమాండ్‌కు తరలించినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం చెన్నాయిపాలెం గ్రామానికి చెందిన మాలోతు దుర్గాప్రసాద్ అడ్డగూడూరు మం డలంలోని డీ రేపాక గ్రామ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌గా పనిచేశాడు. 2022 నుంచి అక్టోబరు 17 నుంచి 2023 వరకు విధులు నిర్వర్తించాడు. ఆ సమయంలో ఐదుగురికి సంబంధించిన రూ.53 వేల డిపాజిట్లను సొంత అవసరాలకు వాడుకుని వారిని మోసగించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యాదగిరిగుట్టకు ఎన్డీఆర్ఎఫ్ బృందం


పరికరాలను సిద్ధం చేసుకుంటున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

యాదగిరిగుట్ట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో యాదాద్రిభువనగిరి జిల్లాను రెడ్‌జోన్‌గా ప్రకటించినందున సుశిక్షితులైన ఎన్డీఆర్ఎఫ్ సహాయ బృందం మూడు రోజుల పాటు యాదగిరిగుట్టలో సేవలు అందించనుంది. ప్రపంచ ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతోన్న యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం పరిధిలో అగ్నిమాపక కేంద్రానికి బుధవారం ఎన్డీఆర్ఎఫ్ (జాతీయ విపత్తు నిర్వహణ) బృందం చేరుకుంది. యాదగిరిగుట్ట దేవస్థాన పాత గోశాల ప్రాంగణంలోని అగ్రిమాపక కేంద్రంలో ఈ బృందానికి ఏర్పాట్లుచేశారు. ఈ బృందంలో ఇద్దరు స్టేషన్ ఫైర్ అధికారులు, నలుగురు లీడింగ్ ఫైర్‌మన్లు, 14 మంది ఫైర్‌మన్లు ఉన్నారు. వీరంతా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే యంత్ర పరికరాలతో శిక్షణ పొందారు. విపత్తులను ఎదుర్కొనేందుకు సిబ్బందికి కావాల్సిన అత్యాధునిక పరికరాలు కేంద్రానికి చేరుకున్నట్లు జిల్లా అగ్నిమాపక అధికారి కే. మధుసూదన్‌రావు తెలిపారు. ఇందులో ఎక్యూమట్స్, రెండు రెస్క్యూ బోట్లు, రెస్క్యూరోప్స్, లైఫ్ జాకెట్స్, విక్టిమ్ లోకేటింగ్ కెమెరా, కట్టర్లు, రెండు ఎన్డీఆర్ఎఫ్ వాహనాలతోపాటు ఆధునిక పరికరాలు వచ్చినట్లు వివరించారు. వరద నీటిలో ధరించేందుకు వాటర్ ప్రూఫ్ జాకెట్లు, ట్రౌజర్లు, బెర్ముడా, డుంగారి డ్రెస్, ఎల్ఈడీ హెడ్‌లైట్‌తో కూడిన హెల్మెట్, ఫేస్ షీల్డ్, మాస్కు వంటి అధునాతన పరికరాలు ప్రత్యేకంగా సిబ్బంది కోసం కొనుగోలు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రమాదాలకు సంబంధించిన సమాచారం సమీపంలో ఫైర్ స్టేషన్లకు అందించాలని కోరారు. సమాచారం అందించేందుకు ప్రజలు ఎప్పుడు అప్రమత్తంగా ఉండి బృందం సేవలు వినియోగించుకోవాలన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు


గుట్టలో కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్యపూజలు వైభవంగా నిర్వహించారు. స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకించి తులసీదళాలతో సహస్రనామార్చనలు చేశారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి నిత్యతిరుకల్యాణోత్సవ పర్వాలు నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం, అంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో రుద్రహవనం నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.15,69,845 ఆదాయం సమకూరినట్లు ఈవో వెంకట్రావు తెలిపారు.

మట్టపల్లిలో వైభవంగా

మఠంపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి లక్ష్మీనృసింహుని ఆలయంలో స్వామి, అమ్మవార్లకు బుధవారం విశేష అర్చనలు జరిగాయి. పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అష్టోత్తర నామార్చనలు సుదర్శన హోమాలు చేపట్టారు. ఆంజనేయస్వామికి సహస్ర నాగవల్లీ దళార్చన జరిగింది. నిత్యకల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపించారు. క్షేత్రంలోని శివాలయంలోనూ ఏకాదశ రుద్రాభిషేకం, పూజలు కొనసాగాయి. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

వరికోత మిషన్ చోరీ యత్నం

చిలుకూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని సీతారాంపురం గుట్టలో వరి కోత మిషన్ చోరీకి యత్నించిన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ సురేష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గత యాసంగి సీజన్‌లో వరికోతల కోసం వచ్చిన చైన్‌మిషన్ మరమ్మతులకు గురికావడంతో కోదాడ-జడ్చర్ల రహదారికి సమీపంలోని సీతారాంపురం గుట్టలో ఉంచారు. జనసంచారం తక్కువగా ఉండటంతో బుధవారం రాత్రి వరికోత మిషన్‌ను చోరీ చేసేందుకు క్రేన్, ట్రాలీ ఆటోతో చేరుకున్న నిందితులు వరి కోత మిషన్ భాగాలను విడగొట్టే సమయంలో సమీపంలోని రైతులు గమనించారు. ఆ విషయాన్ని స్థానిక పోలీసులకు తెలియజేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని క్రేన్, ట్రాలీ ఆటోలను సీజ్ చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్‌రెడ్డి తెలిపారు.

నాట్లు వేస్తూ ..గుండెపోటుకు గురై..


రామారావు మృతదేహం

కోదాడ రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : పొలంలో నారు వేసేందుకు వెళ్లిన ఓ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని దోరకుంట గ్రామంలో జరిగింది. రూరల్ ఎస్‌ఐ గోపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ గోలి రామారావు(46) గ్రామశివారులోని పొలానికి నారు వేసేందుకు వెళ్లాడు. పొలంలో నారు వేస్తుండగానే గుండెపోటుకు గురై పొలంలో పడిపోయాడు. కొద్దిసేపటి తర్వాత అక్కడికి వెళ్లిన స్థానికులు గమనించి ఆసుపత్రికి తరలించేలోగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రామారావు భార్య పుల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


పద్మయ్య (ఫైల్‌ఫొటో)

తుంగతుర్తి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం అన్నారం గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ కాంత్రికుమార్ తెలిపిన వివరాల ప్రకారం అన్నారం గ్రామానికి చెందిన బుర్ర పద్మయ్య(62) సోమవారం తుంగతుర్తికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నాడు. అన్నారం ఎక్స్‌రోడ్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పద్మయ్యకు ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం




నల్లగొండ క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కేంద్రంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. గడియారం సెంటర్‌లో బుధవారం సాయంత్రం ఓ సెల్‌ఫోన్ దుకాణం వద్ద 45 నుంచి 50 ఏళ్ల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్నిగుర్తించి జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నల్లగొండ వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో సెల్‌నెంబర్ 8712670141, ఎస్‌ఐ సెల్ నెంబర్ 8096849380, స్టేషన్ ఫోన్ నెంబర్ 8712531330కు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ఆత్మకూరు(ఎస్), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం పాతసూర్యాపేట గ్రామంలో మంగళవారం రాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఎడవల్లి మల్లయ్య ఇంట్లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో నిద్రలో ఉన్న కుటుంబ సభ్యులు మేల్కొని బయటకు పరుగులు తీశారు. కొద్దిసేపటిలోనే ఇంటితో పాటు వంట సామాగ్రి, దుస్తులు, ధాన్యం పూర్తిగా కాలి బూడిదయ్యాయి. బుధవారం సమాచారం తెలుసుకున్న ఆర్డీవో వేణుమాధవ్, తహసీల్దార్ అమీన్‌సింగ్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితుడికి 45 కిలోల బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రదీప్‌రెడ్డి, యాకుబ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలి


బొమ్మకల్లులో సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్ శివాజీ, డీఈ శ్రీనివాసాచారి, డీఈ కృష్ణారావు

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు విద్యుత్ సరఫరాలో ఏర్పడే సమస్యలను పరిష్కరించడంతో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని టీజీఎస్పీడీసీఎల్ కంపెనీ ప్రాజెక్ట్ డైరెక్టర్ వీ.శివాజీ సూచించారు. బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ, మాడ్గులపల్లి మండలాల పరిధిలోని సబ్‌స్టేషన్లను డీఈ శ్రీనివాసాచారితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే మూడురోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని, ఇలాంటి పరిస్థితుల్లో సిబ్బ ంది ప్రతిష్ఠాత్మకంగా వ్యవహరించి విద్యుత్ సరఫరాను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరించాలన్నారు. బ్రేక్‌డౌన్ సందర్భంలో వినియోగదారులకు ఏమాత్రం అసౌకర్యం కలుగకుండా సమష్టి కృషితో పనిచేయాలన్నారు. అవసరమైన సామాగ్రిని సైతం అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వర్షంలో విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టే సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆలగడప వద్ద మూసీనది ప్రవాహాన్ని పరిశీలించి, వరద తీవ్రత మరింతగా పెరిగితే విద్యుత్ సరఫరాలో ఏర్పడే ఇబ్బందులు, గతంలో జరిగిన నష్టాన్ని అధికారుల ద్వారా తెలుసుకున్నారు. మాడ్గులపల్లి మండలం బొమ్మకల్లు గ్రామంలో నూతనంగా నిర్మించిన 33/11కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను నెలరోజుల్లో వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట టెక్నికల్ డీఈ కృష్ణారావు, ఏడీఈలు రవీందర్‌రెడ్డి, రవికుమార్, ఏఈలు మణిదీప్, అమర్‌సింగ్, మహేష్, రవీందర్‌రెడ్డి ఉన్నారు.

నవ్య
కుటుంబ కదంబం
గురువారం
14 ఆగస్టు 2025






"విదేశీయుల పాలన నుంచి భారతదేశ విముక్తి లక్ష్యంగా సాగిన పోరాటాలు, ఉద్యమాలు, మహనీయుల త్యాగాల ఫలితం ఈనాడు మనమంతా అనుభవిస్తున్న స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు. తెలుగు నేల మీద సంఘ సంస్కరణోద్యమం, జాతీయోద్యమం కలగలిసి... మానవీయ విలువలకు పట్టంకట్టిన అద్భుతమైన కాలం అది. ఆ మహత్తర ఉద్యమాలకు ప్రత్యక్ష సాక్షులు మాత్రమే కాదు, అందులో భాగస్వాములు... గుత్తా జవహరీబాయి, రావూరి మనోరమ, ఏటుకూరి కృష్ణమూర్తి. 'స్వరాజ్యం మా జన్మహక్కు.' అని నినదించి జైలుకు వెళ్లిన, ఆ ముగ్గురు స్వాతంత్ర్య సమరయోధులను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'నవ్య' పలకరించింది.

ఆ త్యాగాలకు ఏదీ విలువ?

రహస్యంగా పత్రికలు బట్వాడా చేశా...

- ఏటుకూరి కృష్ణమూర్తి, 104 ఏళ్ల

"సామాజిక మార్పును కోరే కమ్యూనిస్టులే కలసి పని చేయలేకపోతున్నారు. ఇక సామాన్యులు ఐకమత్యంతో ఉండాలని కోరుకోవడం అత్యాశ అవుతుందేమో. గుంటూరు టౌన్ హైస్కూల్లో ఎస్ఎల్‌సీ చదువుతున్న రోజుల్లో 'క్విట్ ఇండియా' ఉద్యమానికి మద్దతుగా మేము నిరసన సభ నిర్వహించాం. కొందరు స్నేహితులం కలసి లాలాపేట పోలీస్ స్టేషన్‌మీద జాతీయ జెండా ఎగరేశాం. దాంతో పోలీసులు మమ్మల్ని అరెస్టు చేసి గుంటూరు సబ్ జైలులో నిర్బంధించారు. మాకు సంఘీభావంగా స్థానికులు పెద్ద సంఖ్యలో పరామర్శకు వస్తుండడంతో... మమ్మల్ని బాపట్ల, మంగళగిరి... అలా రకరకాల ప్రదేశాలు తిప్పారు. మేము నాలుగు నెలలకు పైగా జైలు జీవితం గడిపాం. దేశభక్త కొండా వెంకటప్పయ్య గారి మనుమలు నాకు మంచి స్నేహితులు. వారి ఇంటికి తరచుగా వెళ్లేవాణ్ణి. మరోవైపు ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు లాంటి నాయకులను కలిసేవాణ్ణి.



ఆర్మీలో తిరుగుబాటు...

మా బాబాయి ఏటుకూరి జోగిరాజు సైమన్ కమిషన్ వ్యతిరేక పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆయన స్ఫూర్తితోనే నేనూ జాతీయోద్యమంలోకి వెళ్లాను. విజయవాడ నుంచి భారత కమ్యూనిస్టు పార్టీ 'స్వతంత్ర భారత్' పత్రిక ప్రచురించేది. ఆ పత్రికను గుంటూరులోని జాతీయోద్యమ నాయకులకు పంచే బాధ్యత నాది. అలా రహస్యంగా చాలాకాలం ఆ పత్రికల్ని బట్వాడా చేశాను. కొన్నాళ్లకు 'బ్రిటిష్ - ఇండియా ఆర్మీ'లో చేరాను. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా రాయల్ ఇండియన్ నేవీ సైనికులు తిరుగుబాటు ప్రారంభించారు. వారికి మద్దతుగా నేనూ నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నాను. మమ్మల్ని అరెస్టు చేసి, లాహోర్ జైల్లో కొన్నాళ్లు నిర్బంధించారు. దేశానికి స్వాతంత్ర్యం ప్రకటించిన తర్వాత మమ్మల్ని విడుదల చేశారు. ఆ వెంటనే ఆంధ్రా రెవెన్యూ శాఖలో ఉద్యోగిగా కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో చేరాను. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులకు నావంతుగా సహకారం అందించాను. ప్రస్తుతం స్వాతంత్ర్య సమరయోధుల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నాను. రోజూ దినపత్రికలే నా కాలక్షేపం."

అమ్మతో కలసి జైలుకెళ్లాను

- రావూరి మనోరమ,
స్వాతంత్ర్య సమరయోధురాలు, 98 ఏళ్ల

"సొంత గొడవే కానీ స్వాతంత్ర్యోద్యమ విలువలు ఈనాడు పట్టినదెవరికి? ఆనాడు అంతా ఒక్కటై దేశంకోసం పోరాడాం. ఈనాడు ఎవరికి వారు గొప్పగా బతకాలని ప్రతిఒక్కరూ ఆరాటపడుతున్నారు. వ్యక్తిగత స్వార్థం పెరిగింది. మనం ఇవాళ అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు తమకు పుట్టుకతోనే వచ్చినవేనన్నది ఈ తరం అభిప్రాయం. అవి ఎందరో మహనీయుల పోరాటాలు, త్యాగాల ఫలితంగా సిద్ధించాయన్న కనీస స్పృహ, ఆలోచన నేటి యువతీ, యువకుల్లో లేకపోవడం బాధాకరం. ఉద్యోగరీత్యా ఎన్నో మంచి అవకాశాలను సునాయాసంగా వదిలి జాతీయోద్యమానికి అంకితమయ్యారు మా నాన్న గోపరాజు రామచంద్రరావు (గోరా). సమాంతరంగా ఆంధ్ర దేశంలో కుల నిర్మూలనోద్యమానికి నాయకత్వం వహించారు. నాస్తికోద్యమంలో ఆయనకు శిష్యుడైన రావూరి అర్జునరావుతో నాకు వివాహం జరిపించి గొప్ప ఆదర్శవాదిగా నిలిచారు. ఇప్పుడు ఆ నిబద్ధత, చిత్తశుద్ధి, నిజాయితీ సమాజంలో పెద్దగా కనిపించడం లేదు.

క్విట్ ఇండియా పోరాటం...

ఒక్క స్వాతంత్ర్య పోరాటమే కాదు, సామాజిక మార్పు కోసం మా నాన్న తలపెట్టిన ప్రతి సంఘ సంస్కరణ ఉద్యమంలో అమ్మ సరస్వతీ గోరాతో పాటు మేమంతా పాల్గొన్నాం. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో విజయవాడలోని ఒకచోట అమ్మ, మా మేనత్త సామ్రాజ్యంతో పాటు నేను, మరి కొంతమంది మహిళలం సమావేశమయ్యాం. అప్పుడు నా వయసు 14 ఏళ్లు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలిస్తూ ర్యాలీకి అలా కదిలామో లేదో... మమ్మల్ని పోలీసులు అరెస్టు చేశారు. విజయవాడ సబ్ జైలులో కొన్ని రోజులు నిర్బంధించిన తర్వాత... మమ్మల్ని రాయవెల్లూరు జైలుకు తరలించారు. కారాగారం అనే మాటే గానీ... ఆట, పాటలతో చాలా సందడిగా ఉండేది. ఒకరితో ఒకరు ఎంతో ప్రేమతో, ఆప్యాయతతో మెలిగేవాళ్లు. జైలర్లు కూడా మమ్మల్ని చాలా గౌరవంగా చూసేవారు. ఆ ఆరునెలల జైలు జీవితం మరచిపోలేని జ్ఞాపకాలను మిగిల్చింది.

మహాత్ముడు నిర్ణయించిన ముహూర్తం...

అర్జునరావుతో నాకు వివాహం నిశ్చయించిన తర్వాత ఆ విషయాన్ని గాంధీగారికి మా నాన్న చెప్పారు. బులుసు సాంబమూర్తి గారి ద్వారా నా ఇష్టాయిష్టాలను తెలుసుకున్న తర్వాత... సేవాగ్రామ్‌లో తన చేతుల మీదుగా మా పెళ్లి జరిపిస్తానని మహాత్మా గాంధీ మాట ఇచ్చారు. అయితే... రెండేళ్లు ఆగమన్నారు. నాకు తూర్పుగోదావరి జిల్లాలోని కస్తూర్బా ఆశ్రమంలో జీవన నైపుణ్యాల శిక్షణ ఇప్పించాల్సిందిగా ఆదేశించారు. అర్జున్‌రావును తన వెంట వార్ధాకు తీసుకువెళ్లారు. ఏడాది తర్వాత ఒక రోజు... 1948, మార్చి 13న మా వివాహానికి మహాత్మాగాంధీ ముహూర్తం ప్రకటించారు. అంతా సవ్యంగా సాగుతోందని అనుకుంటున్న సమయంలో... ఆ ఏడాది జనవరి 30న గాంధీ హత్యకు గురయ్యారు. బాపూజీ లేకపోయినా, ఆయన నిర్ణయించిన ముహూర్తానికి సేవాగ్రామ్‌లోని కస్తూర్బా కుటీరం దగ్గర ఆనాటి దేశ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ లాంటి మహనీయుల సమక్షంలో... అర్జునరావు, నేను నూలుదండలు మార్చుకొని వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టాం. అతిథులకు వేపిన వేరుశెనగపప్పు, బెల్లం పంచారు.

లోక్‌నాయక్ పరామర్శ...

వివాహానంతరం కృష్ణాజిల్లా వానపాములలో కొన్నాళ్లు ఉన్నాం. ఆ సమయంలో నా యోగక్షేమాలు తెలుసుకోవడంకోసం లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణగారు ఆ ఊరు వచ్చారు. గ్రామంలోని దళితవాడలో మేము నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు చూసి మెచ్చుకొన్నారు. తర్వాత 1960 నుంచి నలభై ఏళ్లకు పైగా గుడివాడలో 'అంబేద్కర్ హరిజన బాలికా వసతి గృహం' నడిపాం. వారందరికీ నేనే స్వయంగా వండి వడ్డిస్తే, అమ్మాయిల చదువు బాధ్యతను అర్జునరావు చూసుకున్నారు. అలా ఎంతో మంది నిరుపేద అమ్మాయిలకు తల్లిదండ్రులుగా మారి, చేతనైన సాయం అందించడానికి ప్రయత్నించాం. ఒంట్లో ఓపికున్నంత కాలం పార్టీ రహిత ప్రజాస్వామ్యాన్ని, నాస్తికవాదాన్ని విస్తృతంగా ప్రచారం చేశాం. ఇప్పుడు మా పిల్లలు మిలాప్, చునావ్, సాదిక్, పవర్, అమ్మాయి సూయజ్ కలసి 'మార్పు' ట్రస్ట్ ద్వారా కొన్నిసామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సంపూర్ణ స్వాతంత్ర్యం రాలేదు

- గుత్తా జవహారి బాయి, 102 ఏళ్ల

"పెద్ద వయసు వల్ల కాలు బయట పెట్టలేకపోయినా, బయట ఏం జరుగుతోందో నాకు తెలుసు. టెలివిజన్‌లో ముఖ్యమైన వార్తలు ప్రతిరోజూ తప్పనిసరిగా చూస్తాను. నేటి రాజకీయాలు బాగోలేవు. అంతా స్వార్థం, అవినీతి, నిలకడలేనితనం. స్వాతంత్ర్యం వచ్చి 78ఏళ్లు అయినా... ఈ దేశంలో ఇంకా కూడు, గూడులేనివారు ఎంతోమంది ఉన్నారంటే, సంపూర్ణ స్వాతంత్ర్యం రాలేదనే కదా అర్థం! ఏమయ్యాయి ఆనాటి స్వాతంత్ర్యోద్యమ ఆశలు, ఆకాంక్షలు? జాతీయోద్యమంలో మా కుటుంబం మొత్తం పాల్గొని జైలుకు వెళ్లింది. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న కారణంగా నా భర్త గుత్తా సుబ్రహ్మణ్యం సోదరులు రామానుజయ్య, రాఘవయ్య, చలమయ్య, మా ఆడపడుచు రాజారత్నం, నా పెద్ద తోటి కోడలు సుందరమ్మ... వీరంతా జైలు శిక్ష అనుభవించారు. సుందరమ్మ అయితే విష జ్వరంతో బాధపడుతూ రాయవెల్లూరు జైలులోనే మరణించింది. 'బ్రిటిష్ ప్రభుత్వం నశించాలి', 'స్వాతంత్ర్యం కావాలి' అని రోడ్డుమీద నినాదాలు చేసినందుకు నన్నూ అరెస్టు చేసి, కొద్దిరోజులు జైల్లో ఉంచారు.

నేతాజీకి మా నాన్న స్నేహితుడు

నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌కు మా నాన్న గుంటూరు సుబ్బారావు మంచి స్నేహితుడు. కోల్‌కతా ఒరియంటల్ కాలేజీలో వారిద్దరికీ పరిచయం. వారిమధ్య చాలాకాలం ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా నడిచాయి. నేతాజీ స్ఫూర్తితో మా నాన్న కూడా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారు. నాన్నకు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో సత్సంబంధాలున్నాయని తెలిసి పోలీసులు చాలారోజులు ఆయనను వెంటాడారు. అటు నా పుట్టింటివారు, ఇటు మెట్టినింటి వారు స్వాతంత్ర్యోద్యమంతో పాటు సంఘ సంస్కరణోద్యమంలోనూ భాగమయ్యారు. ఇప్పుడు ఆ విలువలను కొనసాగించడానికి యువత ముందుకు రావాలి. మహనీయుల వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలి."

● సాంత్వన్, ఫొటోలు: హరిప్రేమ్

వరద పోటెత్తి..

● ఉమ్మడి జిల్లాలో ఎడతెరిపిలేని వర్షం ● ఉప్పొంగుతున్న మూసీ పరివాహకం ● పలుచోట్ల నిలిచిన రాకపోకలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బుధవారం వర్షం కురిసిన వర్షానికి పలుచోట్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు నిండుతున్నాయి. కొన్ని చోట్ల వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.



అడవిదేవులపల్లిలో లోలెవల్ వంతెనపై నుంచి వరదనీరు ప్రవహిస్తుండడంతో కాలినడకన దాటుతున్న ప్రయాణికులు

బీబీనగర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలో మూసీలో వరద ప్రవాహం కొనసాగుతోంది. వర్షాలకు మూసీలో వరద ఉధృతి కొనసాగుతోంది. హైదరాబాద్ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ నుంచి జలాశ యాలకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల నుంచి దిగువనున్న మూసీకి నీటిని విడుదల చేస్తున్నారు. మంగళవారం కురిసిన వర్షాలకు బుధవారం ఉదయం బీబీనగర్, భూదాన్‌పోచంపల్లి మార్గంలో రుద్రవెల్లి- జూలూరు మధ్యలో లెవల్ బ్రిడ్జిపై నుంచి రెండు అడుగుల ఎత్తు మేర మూసీ వరద నీరు ప్రవహి స్తుంది. దీంతో అధికారులు ఆ మార్గంలో రాకపోకలు కొనసాగించకుండా ఇరువైపుల బారికేడ్లు ఏర్పాటు చేసి సిబ్బందిని కాపలా ఉంచారు.



పాలకవీడు మండలం బాపనకయ్య వాగు ఉధృతి

గుండెబోయినగూడేనికి నిలిచిన రాకపోకలు

పాలకవీడు: సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం గుండెబోయినగూడెం గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు నిండి వరద నీరు గ్రామంలోని చేరింది. బాపనకయ్య వాగు లోలెవ్ బ్రిడ్జి మీదుగా వరద నీరు ప్రవహించడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. నాగార్జునసాగర్ గేట్లు ఎత్తి మూడు లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతుండడంతో పులిచింతల ముంపు గ్రామమైన గుండెబోయినగూడెంలోకి నీరు చేరింది.

ఎర్రవాగు బ్రిడ్జిపై భారీ వరద

చింతలపాలెం: భారీ వర్షాలకు సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వరద నీరు బ్రిడ్జిలు, రోడ్లపై నుంచి ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మంగళవారం రాత్రి బుధవారం ఉదయం కురిసిన భారీ వర్షంతో చింతలపాలెం మండలంలోని జగ్గయ్యపేట నుంచి దొండపాడు వెళ్లే రోడ్డుపై ఎర్రవాగు వద్ద నిర్మించిన బ్రిడ్జిపై భారీగా వరద నీరు చేరడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మండలంలోని దొండపాడు గ్రామంలో దొండపాడు, జగ్గయ్యపేట రోడ్డు బ్రిడ్జి, బైపాస్ రోడ్డు బ్రిడ్జిపై ఎర్రవాగు నీటి ప్రవాహాన్ని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పరిశీలించారు. ఎర్రవాగు వద్దకు ప్రజలు వెళ్లకుండా అధికారులు అందుబాటులో ఉండి అప్రమతం చేయాలని సూచించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దన్నారు. రాత్రి వర్షం కురిస్తే సహాయక చర్యలు చేపట్టేందుకు జడ్పీహెచ్ఎస్‌లో క్యాంపు ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. నీరుపొంగి ప్రవహించి రోడ్డు మీదకి రాకుండా బ్రిడ్జివద్ద నీరు ఆగకుండా బయటకి వెళ్లేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 12గేట్ల ద్వారా పులిచింతల నీటిని విడుదల చేస్తున్నారు.

సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల నిలిపివేత

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో ఎడమ కాల్వ, వరద కాల్వలకు నీటి విడుదలను బుధవారం సాయంత్రం నిలిపివేశారు. సాగర్ ఎడమ కాల్వకు వానాకాలం పంటల సాగు నీటి అవసరాల కోరకు గత నెల 26వ తేది నుంచి నీటి విడుదల ప్రారంభించారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆయకట్టులో రైతులకు నీటి అవసరం లేనందున ఎడమ కాల్వ, వరద కాల్వకు నీటి విడుదలను నిలిపివేసినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. అలాగే కుడి కాలువకు నీటి విడుదలను తగ్గించారు.

రెండు రోజులుగా వీడని వర్షం

కేతేపల్లి: వర్షం ధాటికి నల్లగొండ జిల్లా కేతేపల్లిలోని జాతీయ రహదారికి ఇరువైపులా గల సర్వీసు రోడ్లపై నీరు నిలిచింది. మండలంలోని ఇనుపాముల గ్రామంలో 65వ నెంబర్ జాతీయ రహదారిపై నిర్మించిన అండర్ పాసింగ్ వంతెన కింద పెద్ద ఎత్తున వర్షం నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. ఈ అండర్‌పాస్ వంతెన కింద నుంచి నకిరేకల్ పట్టణానికి వెళ్లే కేతేపల్లి, కొర్లపహాడ్, ఇనుపాముల, బండపాలెం, కొండకిందిగూడెం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు, సూర్యాపేట, నకిరేకల్ పట్టణాల మధ్య నడిచే ప్యాసింజర్ ఆటోలు హైవే మీదుగా ప్రయాణించి నకిరేకల్ శివారులోని తిప్పర్తి రోడ్డు మీదుగా వెళ్లారు.

సాగర్‌కు మరింత పెరిగిన వరద

నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26గేట్ల ద్వారా నీటి విడుదల



మూసీ ప్రాజెక్టు 7క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న వరద నీరు

నాగార్జునసాగర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్‌కు ఎగువ నుంచి వరద రాక మరింతగా పెరిగింది. దీంతో సాగర్ 26 క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి 18గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేసిన అధికారులు బుధవారం తెల్లవారుజాము నుంచి ఎగువ నుంచి వరద రాక పెరగడంతో రెండు గేట్లను పెంచి 20 గేట్లు, ఉదయం 9 గంటలకు 4గేట్లను ఎత్తి మొత్తం 24గేట్లు, 10గంటలకు మరో రెండు గేట్లనుఎత్తి మొత్తం 26 గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. బుధవారం సాయంత్రానికి సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం 588.90 అడుగులకు చేరుకుంది. సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590అడుగులు(312.0450టీఎంసీలు) కాగా ప్రస్తుతం 588.90 అడుగులుగా (308.7614 టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 4,050క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 2,557 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,339 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800క్యూసెక్కుల నీటిని, 26 క్రస్ట్ గేట్లల్లో 4 క్రస్ట్ గేట్లను 10అడుగుల మేరకు, 22క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేరా ఎత్తి 2,34,850 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 2,71,596 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 2,30,540 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతుంది. వరద కాల్వకు నీటి విడుదలను నిలిపివేశారు.

మూసీ ఏడు గేట్ల ద్వారా నీటి విడుదల

కేతేపల్లి: హైదరాబాద్‌తో పాటు మూసీ ఎగువ పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు మూసీ ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. ప్రాజెక్టుకు 6,477క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా ప్రాజెక్టు 7గేట్లను రెండు అడుగుల మేర ఎత్తి 14వేల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 645అడుగులు(4.46టీఎంసీలు) కాగా ప్రస్తుత నీటిమట్టం 642.90అడుగులు(3.91టీఎంసీలు)గా ఉంది. కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టుకు 71.30క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఆయకట్టు రైతుల ఆనందం

శాలిగౌరారం: శాలిగౌరారం ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండి అలుగుపోస్తోంది. కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి మూసి నది ఫీడర్ ఛానల్ ద్వారా శాలిగౌరారం ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 21 అడుగులకు గాను 21అడుగులు నీటిమట్టం చేరి ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. ప్రాజెక్టు పూర్తిగా నిండి అలుగు పోస్తుండటంతో ఆయకట్టు రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



దామరచర్ల శివారు కల్వర్టుపై నుంచి ప్రవహిస్తున్న నీరు



మత్తడి దూకుతున్న తుమ్మలపెన్‌పహాడ్ పెద్ద చెరువు



వర్షానికి పారుతున్న దేవరకొండ మండలంలోని తాటికోల్ వాగు



వరద నీటితో నిండిన అంబభవాని పంపు హౌస్

పొంగిపొర్లుతున్న మూసీ నది

వలిగొండ: యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని మూసీనది పొంగిపొర్లుతోంది. సంగెం పరిధిలోని భీమలింగం వద్ద ఉన్న కల్వర్టుపై నుంచి అధికారులు జేసీపీతో గుర్రెపు డెక్కను తొలగించారు. దీంతో వరద నీరు కల్వర్టు కింది నుంచి ప్రవహించడంతో బుధవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాకపోకలకు అనుమతించారు. ప్రొద్దటూరు వర్కట్‌పల్లి, గ్రామాల మధ్య మూసీ ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలను నిలిపివేశారు.



వలిగొండలో ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ

ప్రాజెక్టులకు జలకళ

దేవరకొండ: దేవరకొండ డివిజన్‌లో ప్రాజెక్టులకు జలకళ సంతరించుకుంది. పెండ్లిపాకల, డిండి ప్రాజెక్టులు, గొట్టిముక్కుల రిజర్వాయిర్‌లోకి నీరు వచ్చి చేరింది. గొట్టిముక్కుల రిజర్వాయిర్ రెండు గేట్లు ఎత్తినీటి విడుదల చేసి మూసివేశారు. వరదనీరు కొండభీమనపల్లి ప్రాజెక్టులోకి చేరుకుంటుంది. శ్రీశైలం నుంచి నీటి విడుదల చేస్తుండడంతో కృష్ణా పరివాహక ప్రాంతమైన నేరడుగొమ్ము మండలం వైజాగ్‌కాలనీకి వరద నీరు పెరిగింది. పెద్దమునిగల్లో 181.55కోట్లతో నిర్మిస్తున్న అంబభవాని ఎత్తిపోతల పథకం పంపుహౌస్ వరదనీటితో నిండంతో పనులు నిలిచిపోయాయి. నాగర్‌కర్నూల్ జిల్లా ఎగువ భాగన వర్షాలు కురవడంతో దేవర కొండ మండలం తాటికోల్, మైనంపల్లి, వాగులు పారుతున్నాయి.

పొంచిఉన్న ప్రమాదం..

శాలిగౌరారం: వర్షాలకు శాలిగౌరారం ప్రాజెక్టు కట్టకు రెండు చోట్ల గుంతలు పడ్డాయి. ప్రస్తుతం ప్రాజెక్టులో పూర్తి స్థాయిలో నీరు చేరడంతో కట్ట తెగే ప్రమాదముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కట్టకు ఆరు నెలల క్రితం కొద్దిగా వర్షాలు పడినప్పుడు పట్టించుకో కపోవడంతో భారీ వర్షాలకు కట్టపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయని రైతులు చెబుతున్నారు.



ప్రాజెక్టు కట్టపై ప్రమాదకరంగా ఏర్పడిన గుంతలు

పాఠశాలకు తాళం.. విద్యార్థులకు సెలవు

ఆత్మకూర్(ఎస్), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మలపెన్‌పహాడ్ గ్రామ జడ్పీహెచ్ఎస్ తరగతి గదులు శిథిలావస్థలో ఉన్నాయి. ఎంఈవో దారాసింగ్ పాఠశాలకు బుధవారం తాళం వేసి విద్యార్థులకు సెలవు ప్రకటించారు. పాఠశాల గదుల స్లాబ్ పెచ్చులు రాలి పడిపోతున్నందున, వర్షాలకు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని డీఈవో ఆదేశాల మేరకు పాఠశాలకు తాళం వేసి విద్యార్థులకు సెలవు ప్రకటించినట్లు ఎంఈవో తెలిపారు.

పింఛనర్లను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు

కోదాడ టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పింఛనర్లను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య, జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బొల్లు రాంబాబులు అన్నారు. బుధవారం కోదాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడాలేనివిధంగా 75 సంవత్సరాలు నిండిన పెన్షనర్లను, ఎస్టీవోలను కలవాలని డీటీవో చేసిన ప్రకటన అయోమయంగా, భయపడేవిధంగా ఉందన్నారు.

భారీ వర్షాలతో జన జీవనం అస్తవ్యస్తం

● పొంగిపొర్లుతున్న వాగులు, చెరువులు ● నీట మునిగిన పంట పొలాలు



మఠంపల్లి మండలం రఘునాథపాలెంలో భారీ వర్షానికి నీట మునిగిన పత్తి పైరు

కోదాడ రూరల్, చింతలపాలెం, నేరేడుచర్ల, తిరుమలగిరి రూరల్, మేళ్లచెర్వు, పెన్‌పహాడ్ ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి చెరువులు పూర్తిస్థాయిలో నిండి అలుగు పోస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమైనందున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

● గతంలో వచ్చిన వరదతోనే తాము తీవ్రంగా నష్టపోయామని, మళ్లీ వర్షాలు చుట్టుముట్టాయని తొగర్రాయి, కూచిపూడి గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 15 కిలోమీటర్ల మేర ఉన్న అంతరగంగ వాగు ఉధృతంగాప్రవహిస్తున్నందున కూచిపూడి వద్ద వంతెన పైనుంచి నీరు వెళ్లడంతో రామాపురం, దొండపాడు తదితర ఎనిమిది గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. తమ్మర చెరువు నిండి అలుగు పోస్తున్నందున తమ్మర, గోండ్రియాల మధ్య రాకపోకలు నిలిచిచాయి. దోరకుంట, కాపుగల్లు, రెడ్లకుంట, నల్లబండగూడెం, గణపవరం, తొగర్రాయి, ఎర్రారం, చెరువులు పూర్తిస్థాయిలో నిండి అలుగు పోస్తున్నాయని గ్రామస్థులు తెలిపారు. వరి నాట్లు వేస్తున్న సమయంలో వర్షాలు కురుస్తున్నందున నారు కొట్టుకుపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలతో వరితో పాటు కంది, పెసర, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరారు.

కాల్వకు గండి: నీట మునిగిన పత్తి పైర్లు

చింతలపాలెం మండలంలోని కిష్టాపురం గ్రామ శివారులో చింతిర్యాల బ్రాంచ్ కాలువకు బుధవారం గండిపడటంతో పత్తి పంట నీట మునిగింది. పంట పొలాల్లోని నీరు కాల్వలోకి భారీ మొత్తంలో ఒక్కసారిగా చేరింది. దీంతో కాల్వ పొంగి గట్లపై నుంచి నీరు ప్రవహించినందున కాలువ కోతకు గురై గండి పడి 25 ఎకరాల్లో పత్తి చేలు ముంపునకు గురయ్యాయి. ఈ విషయమై ఇరిగేషన్ డీఈ స్వామి వివరణ కోరగా, ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఇసుక బస్తాలతో తాత్కాలికంగా గండిని పూడ్చించామని, వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత పూర్తిస్థాయిలో మరమ్మతు చేయిస్తామన్నారు.

రాకపోకలకు అంతరాయం

● నేరేడుచర్ల నుంచి జాన్‌పహాడ్ వెళ్లే దారిలో నర్సయ్యగూడెం వద్ద రహదారిపై నుంచి వరద నీరు ప్రవహించినందున కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు, రెవెన్యూ, ఎన్ఎస్పీ, మునిసిపల్ సిబ్బంది అక్కడే ఉండి ప్రజలను అప్రమత్తం చేశారు. గంటవారి గూడెం నేరేడుచర్ల వెళ్లే రహదారిలో పెంచికల్‌దిన్నె వద్ద చెరువ వరద ఉధృతిగా ఉన్నందున రాపోకలు నిలిచాయి. సుమారు 100 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. పాత నేరేడుచర్ల వద్ద వాగు పొంగి పొర్లడంతో వరి పంట నీటమునిగింది. నేరేడుచర్ల పట్టణంలోని జాన్‌పహాడ్ రోడ్డు బైపాస్‌లో ప్రభుత్వ భూములలో వేసుకున్న గుడిసెల్లోకి వరద నీరు చేరి నివసించడానికి ఇబ్బందిగా మారింది. భారీ వర్షాలు ఉన్నందున ఇళ్లను వెంటనే ఖాళీ చేయాలని ప్రజలను ఎస్ఐ రవీందర్ వారిని ఆదేశించారు. వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సైదులు, ఎస్ఐ రవీందర్, ఎన్ఎస్పీ డీఈ అమరేందర్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డిలు కోరారు.



కోదాడలో నిండకుండలా చెరువులు

నీట మునిగిన పంట పొలాలు

వర్షాలకు మునగాల మండలంలోని ముకుందాపురం సమీపంలో జాతీయ రహదారి వెంట ఉన్న పంట పొలాలు నీటి మునిగాయి. రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్డు నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలివేశారు రోడ్డు కింద ఉన్న కల్వర్టులు మట్టితో నిండటంతో వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిచి నాట్లు చేసిన 20ఎకరాల పొలాలు మునిగాయని రైతులు నర్ర సరోజన, రణబోతు వెంకటరెడ్డి, నర్ర సుధాకర్‌రెడ్డిలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు.

●పెన్‌పహాడ్ మండలంలోని పొట్లపహాడ్ రోడ్డు వంతెనపై నుంచి నీరు పొంగి ప్రవహిస్తున్నందున వాహనాలు పూర్తిగా నిలిచాయి.. జానారెడ్డినగర్ నుండి పెన్‌పహాడ్ మీదుగా గరిడేపల్లికి వెళ్లే ప్రధాన బీటీ రోడ్డు గుంతలమ యంగా మారింది. అనాజిపురం నుంచి దోసపాడు వరకు రహదారి పూర్తిగా గుంతలు పడటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

● మఠంపల్లి మండలంలోని చౌటపల్లి నుంచి మేళ్లచెరువు వెళ్లే రహదారిలో కప్పలవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నందున రెండు మండలాలకు రాకపోకలు నిలిచాయి.. మఠంపల్లి నుంచి రఘునాథపాలెం వెళ్లే రహదారిలో రైల్వేట్రాక్ వద్ద వరద ప్రవాహం ఉధృతంగా ఉంది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి దిగువకు వరదనీరు రావడంతో పాటు వర్షాలు కురుస్తున్నందున మట్టపల్లి వద్ద కృష్ణానదీ ఉధృతంగా ప్రవహిస్తోంది. భారీ వర్షానికి యాతవాకిళ్ళ చెరువు నిండి అలుగుపోస్తుండగా, చౌటపల్లి, మఠంపల్లి, పెదవీడు, బక్కమంతులగూడెం, అల్లీపురం చెరువులు వరద నీటితో కళకళలాడుతున్నాయి. వరద నీటి ప్రవాహంతో మండలంలో పలు గ్రామాలు, తండాలు జలమయమ య్యాయి.

● పెన్‌పహాడ్ మండలంలోని ప్రధాన రహదారులు వర్షం నీటితో నిండాయి. జానారెడ్డినగర్ నుంచి పెన్‌పహాడ్ మీదుగా గరిడేపల్లి వెళ్ళే ప్రధాన తారు రోడ్డు గుంతలమయంగా మారింది. అనాజిపురం నుంచి దోసపాడు వరకు ఉన్న రహదారి పూర్తిగా గుంతలు పడటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

● మేళ్లచెర్వు మండల వ్యాప్తంగా వాగులు, వంకలు, పొంగి పొర్లుతున్నాయి. మండలంలోని పలు మార్గాల్లో రాకపోకలను అధికారులు నిలిపివేశారు.

వైద్య శిబిరం నిర్వహణ

తిరుమలగిరి రూరల్: కలెక్టర్ ఆదేశాల మేరకు తిరుమలగిరి మండలంలోని తొండ గ్రామంలో ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించడంతో పాటు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ హరిప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజలు కలుషిత నీటిని తాగొద్దని, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.



మునగాల మండలం ముకుందాపురంలో నీట మునిగిన పంట పొలాలు



నేరేడుచర్లలో సిబ్బందికి సూచనలిస్తున్న ఎన్ఎస్పీ డీఈ అమరేందర్‌రెడ్డి



చింతలపాలెంలో కాల్వకు గండి పడి నీటట మునిగిన పత్తి పంట

సురక్షిత శిబిరాలు ఏర్పాటు చేయాలి

● కలెక్టర్ తేజస్‌నందాలాల్ పవార్



మేళ్లచెర్వు, కోదాడ మధ్యలో నిర్మాణంలో ఉన్న వంతెనను పరిశీలిస్తున్న కలెక్టర్

నేరేడుచర్ల, మఠంపల్లి, గరిడేపల్లి, మేళ్లచెర్వు, పాలకవీడు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాల్లో సురక్షిత శిబిరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ తేజస్ నందన్‌లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి నేరేడుచర్ల మునిసిపాలిటీ పరిధిలోని జాన్‌పహాడ్ రోడ్డులోని కల్వర్టు వద్ద వరద ప్రవాహాన్ని కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో జాన్‌పహాడ్ రోడ్డులో రాత్రి వేళల్లో ప్రయాణికులకు ఎలాంటి అపాయం జరగకుండా మునిసిపల్, పోలీస్ సిబ్బంది విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. దిర్శించర్ల ఊర చెరువు అలుగును పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్డీవో శ్రీనివాసులు, మునిసిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి, తహసీల్దార్ సైదులు, ఎస్ఐ రవీందర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులను కారులో ఎక్కించుకున్న కలెక్టర్

మఠంపల్లి - రఘునాథపాలెం రహదారిలో రైల్వే వంతెన వద్ద నీరు పొంగి ప్రవహిస్తున్నందున రఘునాథపాలెం వెళ్లే మోడల్ స్కూల్ విద్యార్థులు వాగు దాటేందుకు ఇబ్బందులు పడ్డారు. విద్యార్థులను కలె క్టర్ తేజస్‌నందలాల్‌పవార్ గుర్తించి తన కారులో ఎక్కించుకుని పాలెంకు వెసుకెళ్లారు. అదే విదంగా వివిధ ప్రాంతాలకు వెళ్లే మోడల్ స్కూల్ విద్యార్థులకు ఎస్‌సీఎల్ పరిశ్రమ బస్సు ద్వారా రవాణా సౌకర్యం కల్పించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ మంగ, ఎంపీడీవో వెంకటచారి, ఏవో శ్రీనివాస్, ఎంఈవో వెంకటాచారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

● భారీ వర్షాలు కురుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తేజాస్ నందలాల్ పవార్ ఆదేశించారు. బుధవారం కురిసిన భారీ వర్షానికి మఠంపల్లి మండలంలోని చౌటపల్లి, మఠంపల్లి, రఘునాథపాలెం గ్రామాల్లో పర్యటించారు. అదేవిధంగా గరిడేపల్లి మండలంలోని పొనుగోడు గ్రామంలో కల్వర్టుపై నుంచి ప్రవహిస్తున్న వరద నీటిని అధికారులతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. భారీ వర్షానికి మండలంలోని పరెడ్డిగూడెం, గారకుంటతండాలో రెండు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు తహసీల్దార్ బండ కవిత తెలిపారు. ఆయన వెంట హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ బండ కవిత, ఎంపీడీవో ఆర్.సరోజ, ఎస్ఐ నరేష్, పంచాయతీరాజ్ ఏఈ కల్యాణ్, ఆర్ఐ రాంబాబు, కార్యదర్శి ఆదినారాయణ ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

● మేళ్లచెర్వు మండలంలో కలెక్టర్ పర్యటించారు. కోదాడ, మేళ్లచెర్వు మార్గంలోని కందిబండ గ్రామంలో నిర్మాణంలో ఉన్న వంతెను పరిశీలించారు. కందిబండ, రెడ్లచెర్వు నుంచి పొంగిపొర్లుతున్న వర్షపు వరద నీరు రోడ్డు మీదకు రాకుండా, వంతెన వద్ద ఆగకుండా బయటకు వెళ్లేలా సహాయక చర్యలు చేపట్టాలని ఆర్అండ్‌బీ డీఈ రమేష్‌బాబును కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా మండలంలో దెబ్బతిన్న రహదారులను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వర్షాల కారణంగా చేపలకు వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ రాజేందర్‌నాథ్‌రెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దు

భారీ వర్షాలకు కురుస్తున్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. పాలకవీడు మండలంలోని పలు వరద ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటించారు. రాఘవాపురం- మీగడంపాగుతండా మధ్యలో ఉన్న వేములూరు వాగు, నర్లెంగులగూడెం- గుండెబోయినగూడెం బాపనకయ్య వాగులపై ఉన్న వంతెనలకు పరిశీలించారు. కృష్ణా నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రదేశాలకు ప్రజలు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మత్స్యకారులు చేపలవేటకు వెళ్లొద్దని అన్నారు. కృష్ణానది మీద ఉన్న నాగార్జున సాగర్ గేట్లు ఎత్తి 3లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నందున కృష్ణా నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలు, మూగ జంతువులు కృష్ణా నదిలోకి వెళ్లకుండా చూడాలన్నారు. విద్యుత్ మోటార్లు, తీగలు నీటిలో మునుగుతున్నందున షాక్ కొట్టే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజలు కృష్ణానదిలోకి వెళ్లకుండా కృష్ణానదీ పరివాహక ప్రాంత పంచాయతీ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ కమలాకర్, ఎంపీడీవో లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో రెడ్ అలర్ట్: ఎస్పీ నరసింహ

సూర్యాపేట క్రైం, : జిల్లావ్యాప్తంగా మరో మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించిందని, జిల్లాలో రెడ్ అలర్ట్ ప్రకటించామని ఎస్పీ నరసింహ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే చెరువులు, కుంటలు నిండాయని వాగులు పూర్తి స్థాయిలో ప్రవహిస్తున్నాయన్నారు. అత్యవసరమైతే మినహా ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రావొద్దన్నారు. స్తంభాలు తాకరాదని, చేపల వేటకు వెళ్లొద్దని, పాత ఇళ్లలో నివసించొద్దని అన్నారు. వర్షాలు తగ్గేవరకు కూలి పనులకు వెళ్లొద్దని అన్నారు. ఆపద సమయంలో కంట్రోల్ రూం సెల్ నెం. 8712686026కు సంప్రదించాలన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నేరేడుచర్ల, తుంగతుర్తి: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎన్ఎస్పీ డీఈ అమరేందర్‌రెడ్డి కోరారు. బుధవారం నేరేడుచర్ల మునిసిపాలిటీ పరిధిలోని నర్సయ్యగూడెం వద్ద కల్వర్టుపై నుంచి వరద ప్రవహిస్తున్నందున ఆయన పరిశీలించి మాట్లాడారు. మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వరద ఎక్కువగా వస్తున్నందున ముందు జాగ్రత్తగా జాన్‌పహాడ్ మేజర్‌కు నీటిని నిలిపివేశామన్నారు. వరద ప్రవాహం ఎక్కువగా ప్రాంతాల్లో, రహదారుల పైన ప్రజలను అప్రమత్తంగా చేసేందుకు సహాయం కోసం ఎన్ఎస్పీ సిబ్బందిని నియమించామన్నారు. ఆయన వెంట సిబ్బంది నవీన్, రఘు, మోహన్‌రెడ్డి తదితరులున్నారు.



సంగెంలో తెగిన రోడ్డును పరిశీలిస్తున్న ఆర్డీవో వేణుమాధవ్

● వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట ఆర్డీవో వేణు మాధవ్ కోరారు. బుధవారం తుంగతుర్తి మండలంలోని సంగెం గ్రామంలో భారీ వర్షాలకు తెగిన రోడ్డును పరిశీలించి మాట్లాడారు. వెలుగుపల్లిలోని రుద్రమ చెరువు అలుగు ఉధృతంగా ప్రవహించినందుకు సంగెం వద్ద ఉన్న రోడ్డు తెగిందన్నారు. దీంతో సంగెం నుండి కోడూరు, తిమ్మాపురానికి రాకపోకలు ఆగిపోయాయని అన్నారు. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ దయానందం, పంచాయతీరాజ్ డీఈ లింగానాయక్, ఏఈ మహేష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐలాపురం ఒద్దెల వాగు దారి మూసివేత

చివ్వెంల: భారీ వర్షాల నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ప్రకాశ్‌రావు కోరారు. చివ్వెంల మండలంలోని ఐలాపురం గ్రామ శివారులో ఒద్దెల వాగు జాతీయ రహదారి 365 బీబీ పక్క నుంచి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆ వాగును గ్రామస్థులు దాటకుండా రెవెన్యూ సిబ్బందితో అడ్డుగా కంప వేయించి మండల అధికారులతో కలిసి తహసీల్దార్ పరిశీలించి మాట్లాడారు. తహసల్దార్ వెంట ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎస్ఐ మహేశ్వర్, ఇరిగేషన్ డీఈ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఏఈ రాహుల్, కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

పశువుల సంరక్షణకు సూచనలు

కోదాడ రూరల్: భారీవర్షాల నేపథ్యంలో పశువుల సంరక్షణకు కోదాడ ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య పలు సూచనలు చేశారు. లోతట్టు ప్రాంతాల్లో పశువుల్ని కట్టివేయొద్దన్నారు. వర్షం సమయంలో పశువుల్ని బయటకు మేతకు పంపొద్దని, నీటి కోసం చెరువులు, కాల్వల వద్దకు తోలద్దని అన్నారు. మేతకు బయటకు వెళ్లిన తరువాత వర్షం మొదలైతే వెంటనే పశువుల్ని ఇంటికి తెచ్చుకోవాలన్నారు. చెట్లకింద పశువులు, గొర్రెలు, మేకలను నిలిపి ఉంచొద్దని, ఎవరివైనా పశువులు నీటిలో చిక్కుకున్నా, బురదలో చిక్కుకున్నా రైతులు పరస్పరం సాయం చేసుకోవాలన్నారు. ఒకరికొ శిథిల పశువుల పాకలు, భవనాలకు దూరంగా పశువుల్ని ఉంచాలని, వర్షం సమయంలో గొర్రెలు, మేకల కాపరులు తమ వద్ద మొబైల్స్ స్విచ్చాఫ్ చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సహాయం కోసం పశుపోషకులు తమ దగ్గరలోని పశువైద్యుల ఫోన్ నెంబర్లను సేవ్ చేసుకోవాలన్నారు. విద్యుత్ స్తంభాలు, తీగలకు దూరం పశువుల్ని ఉంచాలని, అంటువ్యాధుల నివారణకు పరిశుభ్రమైన నీటిని అందించాలని సూచించారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

కోదాడ టౌన్, కోదాడ రూరల్, చిలుకూరు, తుంగతుర్తి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యమని కోదాడలోని కేఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రమణారెడ్డి అన్నారు. బుధవారం ఆ కళాశాలలో మాదక ద్రవ్యాల నిషేధంపై సెమినార్, మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞను కళాశాల సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యాంటీ డ్రగ్ పోస్టర్లను రమణారెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులతో మాదక ద్రవ్యాల నిరోధన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వి.వెంకటేశ్వర్లు, జి.యాదగిరి, వి.బలభీమరావు, ఆర్. రమేష్, పి.రాజేష్, ఎం.రత్నకుమారి, బి.రమేష్‌బాబు, జి.వెంకన్న, కె. రామరాజు, జి.రవి, కిరణ్ పాల్గొన్నారు.

● కోదాడలోని సనా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి మాట్లాడారు. మత్తుకు దూరంగా ఉండాలని విద్యార్థులతో డీఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కోదాడ రూరల్ సీఐ రజితరెడ్డి, అనంతగిరి ఎస్ఐ నవీన్‌కుమార్, కళాశాల చైర్మన్ నవమన్, కృష్ణారావు, నాగప్రసాద్, గోపిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● నషాముక్త భారత్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నేరేడుచర్ల జడ్పీహెచ్ఎస్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులతో నేరేడుచర్ల మునిసిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, యశోద, మాజీ సర్పంచ్ కొణతం సత్యనారాయణరెడ్డి, హెచ్ఎం బట్టు మధు, ఉపాధ్యాయులు,ాల్గొన్నారు.

● కోదాడ మండలంలోని గుడిబండ గ్రామ జడ్పీ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు డ్రగ్స్ అనర్థాలపై రూరల్ ఎస్ఐ గోపాల్‌రెడ్డి అవగాహన కల్పించారు. డ్రగ్స్ నిర్మూలన అందరి బాధ్యత అని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

● చిలుకూరు మండలంలోని మహాత్మా జ్యోతిరావు పూలే ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై కల్పించిన అవగాహన కార్యక్రమంలో సీఐ రజితారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సై సురేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని తుంగతుర్తిలోని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ రాజామోహన్‌రావు అన్నారు. బుధవారం ఆ కళాశాలలో మాదకద్రవ్యాల నిరోధంపై విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల స్టూడెంట్ కౌన్సిలర్ పజ్జూరి పుల్లయ్య, ఎన్ఎస్ఎస్ సీవోలు నాగయ్య, ప్రవీణ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎక్సరే, స్కానింగ్ తీసేవారేరీ?

(5వ పేజీ తరువాయి)

సంబంధించిన వైద్యులు, మూత్రపిండాల వైద్యులు కూడా లేరు. దీంతో సంబంధిత రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. మెదడుకు సంబంధించిన వైద్యులు(న్యూరాలజీస్టు) సైతం లేరని సిబ్బంది చెబుతున్నారు.

డయాలసిస్ సెంటర్‌కు...

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్‌లో ఐదు మిషన్లు మాత్రమే ఉన్నాయి. రోజు రోజుకు రోగుల సంఖ్య పెరుగుతోందని సిబ్బంది చెబుతున్నారు. ఒక్కో రోగికి పరికరంపై నాలుగు గంటల పాటు వైద్యం(రక్తం శుద్ధి) అందించాల్సి వస్తోంది. దీంతో సమయం సరిపోవడం లేదు. రోగులను మరుసటి రోజు రావాలని చెబుతున్నారు. రోజుకు 25 నుంచి 30 మంది వరకు డయాలసిస్ చేస్తున్నారు. మరో ఐదు పరికరాలు కేటాయిస్తే రోగులకు కొంత వరకైనా న్యాయం చేయవచ్చని వైద్యులు చెబుతున్నారు.

వైద్యుల కోసమే ప్రయత్నిస్తున్నాం

సూర్యాపేట జిల్లా కేంద్ర ఆసుపత్రిలో వైద్యుల కొరత ఉంది. రేడియాలజిస్టు కోసం సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్ డైరెక్టరేట్ కార్యాలయానికి వెళ్తున్నారు. మిగతా శాఖల్లో డాక్టర్లు లేని విషయం డైరెక్టరేట్ కార్యాలయం దృష్టికి తీసుకెళ్లారు. రోగులు ప్రభుత్వ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి.

-జనార్దన్, ఆర్ఎంవో, సూర్యాపేట ప్రభుత్వ దవాఖాన

పరిశ్రమల భద్రతా ప్రమాణాల పరిశీలన

కోదాడ రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లబండగూడెం హెచ్‌పీసీఎల్ కంపెనీలో భద్రతా ప్రమాణాలను బుధవారం జిల్లా అగ్నిమాపక, కాలుష్య, పరిశ్రమ, కార్మిక సంబంధించిన అధికారులు పరిశీలించారు. కలెక్టర్, డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆదేశాల మేరకు పైపులైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కంపెనీ, మెగా గ్యాస్ కంపెనీ, ఆగ్రో ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలను సందర్శించి తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. కంపెనీ యాజమాన్యం పాటిస్తున్న భద్రతా ప్రమాణాలు, అగ్నిమాపక పరికరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పరిశ్రమ ప్రాంగణంలో ఉన్న అన్ని యంత్రాలను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవి, ఫైర్ ఆఫీసర్ జానయ్య, కంపెనీ హెడ్ పీవీఎస్ కిషోర్, జి.వంశీకృష్ణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాల్వలకు మరమ్మతులేవీ?

(5వ పేజీ తరువాయి)

అస్తవ్యస్తంగా మారాయి.

కాల్వల్లో మట్టి కూరుకుపోయింది

శ్రీరాంసాగర్ రెండో దశ కాల్వల ఆధునికీకరణ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు కేటాయిస్తే లైనింగ్ పనులు ప్రారంభిస్తాం. కొన్ని చోట్ల ఉపకాల్వలు ఆనవాళ్లు కోల్పోయిన మాట వాస్తవమే. వర్షాకాలంలో కాల్వ కట్టలు కోతకు గురవుతున్నాయి.

- సత్యనారాయణ, ఎస్సారెస్పీ ఈఈ

పిచ్చి మొక్కలను తొలగించాలి

మెయిన్, ఉపకాల్వల్లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలి. ఏళ్ల తరబడి లైనింగ్ పనులు ప్రారంభిస్తామని చెబుతున్నారు తప్ప పనులు మాత్రం చేయడంలేదు. వెంటనే పనులు ప్రారంభించాలి.

కే.శ్రీనివాస్, కాసర్లపాడు గ్రామం, జాజిరెడ్డిగూడెం మండలం